అంతర్వాహిని

కన్నపల్లి కామేశ్వరి

చలిగాలి రివ్వున వీస్తోంది.

మృత్యుంజయరావ్‌కి తటాలున తెలివచ్చింది.

కిటికీ గుండా బయటికి చూసేడు.

చీకటి దట్టంగా పేరుకుంది.

ఆకసంలో నక్షత్రాలు చెల్లాచెదురుగా కన్పిస్తున్నాయి.

బస్సు ముందుకి దూసుకుపోతోంది సన్నగా రొదచేస్తూ.

డిమ్‌లైట్ వెలుగులో ప్రయాణీకులు బస్సు కుదుపులకి జోగుతూ మ్యూజియమ్‌కి తరలింపబడ్తున్న సజీవ శిల్పాల్లా భ్రమకల్గిస్తున్నారు.

ఇందుమతి నిద్దట్లో ఏదో గొణుగుతోంది.

వసంత తల తన భుజమ్మీద వాలిపోతోంది.

చంద్రబింబం లాటి దాని ముఖంలో ఎవరూ పూడ్చలేని ఆ లోటు తన గుండెల్ని పిండేస్తోంది.

పిలుపునా తనని దహిస్తోంది అనుక్షణమూ.

ఏ పాపం చేసిందని చిట్టితల్లికి ఈ నరకం నిర్దేశించేడా భగవంతుడు ?

ఆడీపాడే వయస్సులోనే ఎంత కష్టం ముంచుకొచ్చింది దీనికి !

పసుపు కుంకుమలతో, పిల్లాపాపలతో నూరేళ్ళు పచ్చగా వర్ధిల్లాల్సిన దీని బ్రతుకు ఎందుకిలా అకాలంగా మోడు బారిపోయింది ?

ఈ అభిశప్త జీవితానికి చివరివరకూ మిగిలేది కన్నీరేనా ??

గోదావరి వంతెనమీద పరుగుతీస్తోంది బస్సు.

చలికి రక్తం గడ్డకట్టుకు పోతోంది.

వసంత సన్నగా వణుకుతోంది.

వసంత తలని నెమ్మదిగా తప్పించి షట్టర్ క్రిందికి లాగేడు మృత్యుంజయరావ్.

ఇందుమతికి తెలివ్వచ్చినట్టుంది.

బద్ధకంగా కళ్లిప్పి భర్తని చూసింది.

"రాజమండ్రి దాటిపోయేమా ?"

"ఇంకాలేదు. మరో పదినిముషా లవుతుం దనుకుంటాను."

"టయిమెంతయింది?"

"పన్నెండు కావడానికింకా పది నిము షాలుంది."

ఇందుమతి వసంత వైపు పరీక్షగా చూసి, స్థానభ్రంశం చెందిన ఆమె పైటని సరిగ్గా సర్దింది.

"అమ్మాయికి నయమవుతుం దంటారా?"

మృత్యుంజయరావ్ జవాబు చెప్పలేదు.

ఇందుమతి గట్టిగా నిట్టూర్చి వెంటనే ఆవలించింది.

సీటుమీద ఒదిగిపోయి, క్షణాల్లోనే నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోయింది.

పాలిపోయిన చిర్నవ్వు మృత్యుం జయరావ్ పెదాలపై మెర్సింది.

ఇందుమతి అదృష్టవంతురాలు!!

కాలభేధం లేకనే కోరినప్పుడల్లా నిద్రపోగలదు.

ఎంతమందికా అదృష్టం దక్కు తుంది?

ఎన్ని ట్రాంక్విలైజర్సు మింగితే కళ్ళముందు నిద్రమబ్బులు దిగుతాయి తనలాటి వాళ్ళకి!

విశ్రాంతికి మరో రూపం నిద్రేనా!?

కూతురి జీవితం కళ్ళముందే రాలిపో తున్నా ఇందుమతికి చింతలేదా?

ఛీ....ఛీ....పొరపాటు.

ఇందుమతి గురించి ఇంత వక్రంగా ఎలా ఊహించ గల్గుతున్నాడు తను!

వసంత భవిష్యత్తు పట్ల ఆందోళన లేనిదైతే తననెందుకు పురికొల్పుతుందీ ప్రయాణానికి?

వసంత జీవితం మళ్ళీ చిగురించాలన్న కోరిక బలంగా నాటుకపోవడంచేతనే, తన కిష్టంలేదని తెల్సినా 'అమ్మ' దగ్గరకు ప్రయాణం కట్టించింది.

న్యూరో స్పెషలిస్టుల మందులకి, కరెంటు ట్రీట్‌మెంట్‌కి లొంగని వసంత 'పిచ్చి' అమ్మ మహిమకి లొంగుతుందా దీని పిచ్చిగాని!!

"ఏ పుట్టలో ఏ పామున్నదో, ఏ అమ్మలో ఏ మహాత్వమున్నదో సామాన్య మానవులం, మన మెలా నిర్ణ యించగలం? చెయ్యాల్సినదల్లా మానవ ప్రయత్నం. తర్కించుకోవలసిన సమయం కాదిది. అమ్మ దగ్గరకు అమ్మాయిని తీసికెడితే ఎందుకో నయ మవుతుం దనిపిస్తోంది నాకు, కాదన కండి...."

శతవిధాలా తనని పోరింది.

తండ్రిగా తనెంత రంపపుకోత అనుభవిస్తున్నాడో, తల్లిగా ఆమె అంతకు మించిన ఆవేదనలో క్షణ క్షణమూ నలిగిపోతోంది. అంతంలేని జీవన పోరాటంలో అలసిపోయి నిస్త్రాణ చెందుతోంది.

నిస్త్రాణకి మారు రూపం కూడా నిద్రే కావచ్చునేమో!?

అవును, అంతే కావచ్చు.

ఆలోచనలు తెగిపోయాయి.

మెర్క్యురీలైట్ల వెలుగులో పట్ట పగల్లా మెర్సిపోతోంది రాజమండ్రి బస్‌స్టేండ్.

రాత్రికీ, పగటికీ భేదం తెలీనట్టు దుకాణాలన్నీ కళ్లు తెరిచే ఉన్నాయి. కూలీల రొదతో ఇందుమతికి మళ్లీ తెలివి వచ్చింది.

వసంత కూడా కళ్లు విప్పింది.

"దాహం వేస్తోందా తల్లీ ?"

జవాబు లేదు.

దాని దృష్టి శూన్యాన్ని శోధిస్తోంది.

బాహ్య ప్రపంచంతో ఏ మాత్రమూ సంబంధంలేనట్టు పేలవంగా కన్పడుతున్న దాని కళ్లని చూస్తుంటే గుండెల్లోంచి దుఃఖం ఎగదన్నుకొస్తోంది.

మరి కొద్దిసేపట్లో మళ్లీ కదిలింది బస్సు.

ఇంతవరకూ వెలుగు.

ఇకపైన అంతా చీకటి.

జీవితం తీరే అంత !

చీకటి చూడని కళ్లకు వెలుగు విలువ తెల్సిరాదు.

కష్టం ఎరుగని జీవితాలకి సుఖం ఇచ్చే ఆనందం అర్థమవ్వదు.

కష్టం— సామాన్యమైన కష్టమా ??

పూచీ కాచే వయస్సులోనే బ్రతుకునే నిలువునా దహించేస్తున్న కష్టం ?!

అప్పగింతలు పెడ్తూ చిన్నపిల్లల్లా కంటతడి పెట్టేరు తామిద్దరూ.

మరో మూడునెలలకి కానీ తెల్సి రాలేదు— తమ జీవితమంతా కన్నీటికే అంకితమయిందని.

పెళ్లిముందు ఇంటికి వేయించిన వెల్ల ఇంకా పాతబడనేలేదు.

కూతురి భవిష్యత్తు వెలవెలబోయింది మూణ్ణెళ్ల కాపురంతోనే. పరవళ్లు త్రొక్కే దాని ఆనందాన్ని సహించలేని విధాత, రెక్కలు విచ్చుకుంటున్న దాన్ని సౌభాగ్యాన్ని నిలువునా నరికిపారేసాడు.

దాని పెళ్లయిన నెలరోజులకే అల్లుడు ప్రొబేషన్ ఆఫీసర్‌గా సెలక్ట్ అయినట్టు అర్డరొచ్చింది.

కలకత్తాలో ట్రయినింగ్.

దాని అదృష్టానికి తామెంత మురిసి పడ్డారని !

మరి రెండు నెలలకి దాని జీవితం ఊహించని మలుపు తిరిగింది.

వడిగా పరిగెత్తే ఎలక్ట్రిక్ ట్రెయిన్ నుండి పట్టుజారి పడిపోయిన అల్లుడి అర్ధాంతరమైన చావుతో దాని నుదుట కుంకుమ బొట్టు చెరిగిపోయింది.

కబురు తెల్సిన వెంటనే దాన్ని పుట్టింటికి తీసికొచ్చారు.

బొట్టు నోచుకోని మొహంతో, గాజుల్లేని బోడి చేతులతో, చీకటి నిండిన గాజుకళ్లతో జీవశ్చవంలా తమ కళ్లెదుట అది తిరుగుతుంటే గుండెలు కరిగి కరిగి కడలిలా మారిపోయాయి.

అగ్నిపర్వాతాలు బ్రద్దలయ్యేయి సాగర గర్భంలో.

భర్త ఆకస్మిక మరణంతో దాని మనసు ఘనీభవించింది.

మస్తిష్కం మొద్దుబారింది.

చైతన్యం అదృశ్యమయింది.

అప్పట్నుంచీ దాని ముఖాన చిర్నవ్వు పూయలేదు.

స్తబ్ధంగా, మౌనంగా కాలంతోపాటే కదలిపోతున్న దాని జీవవాహిని ఎన్ని మలుపులు తిరగబోతోందో, ఏ అగాథంలో ఇంకబోతోందో — 17

ఆర్నెళ్ల క్రితం—

అకస్మాత్తుగా తెలివి వచ్చింది తనకి.

వసంత బెడ్‌రూమ్ తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి.

లోపల లైటు వెలుగు విరజిమ్ముతోంది.

పెట్టెలు జరుపుతున్న చప్పుడు స్పష్టంగా వినబడుతోంది.

అర్ధరాత్రప్పుడు ఇదేం చేస్తున్నట్టు?

లేచి గదిలోకి నడిచేడు తను.

కళ్లు రెప్పలు వేయడం మర్చిపోయాయి విభ్రాంతితో.

నుదుట కళ్యాణ తిలకంతో, చేతుల నిండుగా రంగురంగుల గాజులతో, కన్యాదానం చేసినప్పటి వంగపువ్వు రంగు పట్టుచీరెతో, తలనిండా కనకాంబరాలతో కాళ్లకి పసుపుపారాణితో పెళ్లికూతురిలా అలంకరించుకుంది వసంత.

తన రాకని కూడా గుర్తించలేదు.

చీరెలు, లంగాలు ట్రంకు పెట్టెలో సర్దుకుంటోంది.

ఆ రూపంలో దాన్ని చూస్తుంటే ఇంతవరకూ జరిగిందంతా పీడకలగా మారిపోయి ఉంటే ఎంత బాగుండు ననిపించింది.

కానీ జీవితం కల కాదు.

కరిగిపోయిన కాలం వెనక్కి మరలి రాదు.

"వసంతా, ఏం చేస్తున్నావమ్మా?"

తనవైపు బేలగా చూసింది.

"పెళ్లయిన తరువాత ఎన్నాళ్లని పుట్టింటిలో ఉండేది నాన్నగారూ? ఆయన ఈ పాటికి తిరిగి వచ్చేసి ఉంటారు ట్రెయినింగ్ నుండి. ఆయన్ని విడిచి నేనిక్కడ కూచుంటే ఆయన ఎంత అవస్థపడ్తున్నారో, ఏమో! రిక్షా కేక వేస్తారా నాన్నగారూ- బస్సుకి టయిమయిపోతోంది...."

తల గిర్రున తిరిగింది.

దాని వర్తమానస్థితి అర్థమయ్యేసరికి నిలువెల్లా కంపించింది.

"అమ్మా....వసంతా!!" గుండెల్ని చీల్చుకొచ్చిన కేక.

అప్రయత్నంగా వర్షిస్తున్న కళ్లు.

"ఎందుకు నాన్నగారూ ఏడుస్తారు? దశరాలకి మళ్లీ వచ్చేస్తాగా! ఇంతకీ నేను బయల్దేరుతున్నట్లు ఆయనకి టెలిగ్రామిచ్చేరా?"



"లేదమ్మా, లేదు. రేపు తెల్లారి చెలిగ్రామిస్తాను. ఈ రాత్రికి పడుకోవమ్మా—"

వసంత కళ్లు తృప్తితో వెలిగేయి.

అది పూర్తిగా నిద్రలో మునిగినదాకా అలానే కూలబడిపోయాడు కుర్చీలో.

మగతతో కళ్లు మూతలు పడ్డాయి.

మూతపడ్డ కనుల వెనుక మనోహర దృశ్యం.

ఆకసం నుండి ఎగురుకుంటూ వచ్చిన ఏ గంధర్వ రాకుమారుడో తన చేతుల్లోని దండని వసంత మెడలో వేసేడు.

దాని నుదుట కళ్యాణ తిలకమద్ది దగ్గరగా తీసికున్నాడు.

"పీల్లేదు. అది వితంతువు. దానికి మళ్లీ పెళ్లాడే అర్హత లేదు. విడిచిపెట్టు, విడిచిపెట్టు...." గొంతు చించుకుంటూ అరుస్తోంది ఇందుమతి.

జాలిగా తల్లివైపు చూస్తోంది వసంత.

తనేం పట్టనట్టు చూస్తున్నాడా ఘట్టాన్ని.

గంధర్వుడు వసంతని నడిపిస్తున్నాడు నెమ్మదిగా.

ఇందుమతి కంగారు పడ్తోంది.

"అడ్డుకోరేమిటండీ, అది లేచిపోతోంది. రేపొద్దున మన పరువేంగానూ? నలుగురికీ ఏమని జవాబు చెప్పను?? వెళ్లండి, దాన్ని తీసికురండి...." పిచ్చిదానిలా ప్రాధేయపడ్తోంది.

తను రెండడుగులు వేసేడు ఇందుమతి వైపు.

ఇందుమతి కరిగిపోయి స్వరాజ్యం కన్పిస్తోందక్కడ.

"పరుగులిడే జీవవాహినికి అడ్డుతగిలే హక్కు మనకు లేదు రాజ్యం! ప్రాకృతికమైన శారీరక వాంఛల్ని చాదస్తాల

ఇనుప రెక్కల క్రింద ఎందుకని నలుపుకోవాలి? దాటిపోయిన వయసు మళ్లీ మళ్లీ రమ్మంటే రాదు. నా మాట విను, రాజ్యం–మనిద్దరం పెళ్లి చేసుకుందాం–"

"ఒద్దు, ఒద్దు మృత్యుంజయా! ఆయన మరణంతో నా సౌభాగ్యం తుడుచుక పోయింది. మరోసారి పెళ్లికూతురి ముస్తాబు చేసుకోలేను...."

సన్నగా ఏడుపు.

నిద్ర తేలిపోయింది. వసంత మంచంమీద మోకాళ్లలో తల పెట్టుకుని సన్నగా ఏడుస్తోంది.

"వసంతా–ఏమయిందమ్మా?"

వెక్కిళ్ల మధ్య చెబుతోంది, "ఆయన ఆయన నా కోసమని ఎదురుచూస్తున్నారు, రమ్మని పిలుస్తున్నారు. రావడంలేదని అలిగి వెళ్లిపోతున్నారు...."

"లేదమ్మా, అల్లుడెక్కడికీ వెళ్లిపోడు. నేను నచ్చచెప్తాగా! తెల్లారేక నేనే నిన్ను స్వయంగా దిగబెడ్తానమ్మా, పడుకో తల్లీ...."

వసంత నిద్రపోయింది తన అనునయింపుతో.

రెండో రాత్రి–మళ్లీ అదే తతంగం.

మూడో రాత్రి–మార్పులేదు.

అప్పట్నుండి మిగిలినవన్నీ కాళరాత్రులుగానే మిగిలిపోయాయి.

సాయంత్రమవుతూనే గుండెల్లో దడ.

రాత్రంతా కాపలా కాస్తూ కళ్లు ప్రత్తికాయల్లా ఉబ్బిపోయాయి.

వసంత పిచ్చి రానురాను ముదిరిపోయింది. పగటికి ప్రాకింది.

పగలస్తమానం పెళ్లికూతురి ముస్తాబులో వీధి కిటికీవద్ద నిల్చుని రోడ్డమ్మట పోయేవాళ్లలో తన భర్తకోసం ఎతుక్కుంటోంది.

ఈసంగతి కొద్ది కాలంలోనే ఊరంతా ప్రాకి పోయింది.

దాని ఉన్మాదస్థితికి సానుభూతి వ్యక్తంచేస్తున్న స్నేహితులతో ఇల్లు స్మశానవాటికలా మారిపోయింది.

వాళ్ల సానుభూతి తమ గుండెల్లో సెగడు మరింత ముందుకి తోస్తోంది. కాకినాడ మెడికల్ కాలేజి ఆస్పత్రిలో న్యూరో స్పెషలిస్ట్ మందులకి దాని ఉన్మాదం తగ్గలేదు.

షాక్ ట్రీట్ మెంట్ చేయించేక ఎదురయిన పరిణామం తమని పిచ్చివాళ్లని చేసింది.

దాని చురుకుతనం అడుగంటింది.

పూర్వంలా అది అలంకరించుకోదు. కిటికీ వద్ద నిలబడదు.

మెదడులో జీవకణాలని నిలువునా కాల్చేసిన కరెంటు దాని గతాన్ని కూడా చెరిపేసింది వాటితోపాటు.

ప్రస్తుతం– అది ఏ రాగమూ పలకని మూగవీణ.

నిశ్శబ్దం.

విస్తృతమైన ప్రళయ నిశ్శబ్దం.

ఏమీ కావాలని అడగదు, ఎవరితోనూ మాట్లాడదు.

గంటల తరబడి ఎక్కడ కూచున్నది అలానే స్తబ్దంగా ఉండిపోతుంది.

జడత్వం పేరుకుపోయింది దాని అణువణువునా.

దాని మౌనం భరించలేనిది.

అప్పట్లో, ఆ ఉన్మాదంలో చురుకుదనమే మెరుగనిపిస్తోంది వర్తమానం కన్నా.

దాని జీవితం ఇలా ముగియాల్సిందేనా!?

ఇందుమతి ఎవరినోటనో విన్నదాన్ని తనచెవుల్లో వేసింది. శ్రీకాకుళంజిల్లాలో

రాజపురం అనే గ్రామంలో 'అమ్మ' వెలసిందట.

అమ్మ చేతిలో నయమవని రోగమంటూ లేదట.

శారీరక రుగ్మతలని, మానసిక వైపరీత్యాన్ని ఎడంచేత్తో తీసి పారేస్తుందట. 'అమ్మ' దర్శనంకోసం ఇక్కడి నుండి తండోపతండాలుగా వెళ్తున్నారట స్పెషల్ బస్సులో.

ఇందుమతి పోరు భరించలేక మూడు టిక్కెట్లు తీసికున్నాడు. తనకీ అమ్మలన్నా, బాబాలన్నా విశ్వాసం లేదు.

జీవతంలో తీర్చుకోలేని కోరికల అంతరంగ మథనంలో నలిగిపోయి, పలాయనతత్వం నిచ్చెనచేసుకుని పైకెగబ్రాకుదామని విఫలప్రయత్నం చేస్తున్న ఈ ఆత్మవంచకులా మరెవరి జీవితాలనో సరిదిద్దగలిగేది!

కడలి గర్భాన తుఫాను తాకిడితి ఒరిగిపోతున్న నౌకలో ప్రయాణం చేస్తున్న ఈ ఈత నేర్వనివాళ్లా మిగిలినవాళ్లని అవతలి ఒడ్డుకి చేర్చగలిగేది!!

ఎంత అజ్ఞానం, ఎంత ఆత్మవంచన!

జనంలో మూఢత్వం వేలంవెర్రి వేస్తోంది,

లేని గొప్పదనాన్ని అంటగట్టి తమకన్నా హీనుల్ని, క్షుద్రుల్ని అందలమెక్కిస్తున్నారు. ఆ హీనుల అండదండల్లో తమ బ్రతుకు పుష్పిస్తున్నందనుకుంటున్నారు.

గుడ్డి నమ్మకం.

ఆ నమ్మకపు కవచంలో నిర్భయంగా పయనిస్తున్నారు.

ఇందుమతి ఆ మందలో ఒకతె.

తన ఎంతగా వారించినా వినలేదు.

చివరికి తనూ తలొగ్గక తప్పింది కాదు.

దాని ఫలితం—ఈ ప్రయాణం.

* * *

బస్సు రాజపురం చేరేసరిక్కి పూర్తిగా తెల్లవారిపోయింది. ఊరికి రెండు ఫర్లాంగుల దూరాన తళతళ మెరుస్తోంది ఆశ్రమం తూరుపు వెలుగులో.

కాలకృత్యాలు పూర్తిచేసికొని ఆశ్రమం చేరేసరికి ఎనిమిది గంటలయింది.

అప్పటికే ఆ ప్రాంతం రద్దీగా ఉంది.

జనం నేల ఈనినట్టుగా బారులుతీర్చి ఉన్నారు.

మరి కొద్దిసేపట్లో 'అమ్మ' బయటికి వస్తుందట.

అశేషమైన ఈ భక్తకోటికి దర్శనమిస్తుందట.

బాధగ్రస్తుల్ని వ్యాధిగ్రస్తుల్ని పరామర్శిస్తుందట.

అమ్మ అనుగ్రహంపొందే అదృష్టం కోసం జనం తహతహ లాడిపోతున్నారు.

మృత్యుంజయరావ్, ఇందుమతి, వసంత అందరితో పాటే నిల్చున్నారు.

వెనుక వరసలో బిగ్గరగా మాటలు.

"అమ్మ ఎన్నాళ్ల క్రితం వెలిసిందట ఇక్కడ ?"

"సుమారు ఇరవై ఏళ్లు దాటిందని ఎవరో చెప్పినట్టు గుర్తు. ఇప్పుడిప్పుడే అమ్మ మహత్యం దేశంలో నలు మూలలకీ ప్రాకుతోంది. ఆ విశ్వజననిని దర్శించుకోవాలని విరగబడి వస్తున్నారు భక్తులు."

"అమ్మ ఉద్భవం వెనుక ఏమైనా చెప్పుకోదగ్గ కథలున్నాయా ? అమ్మకి తనవాళ్లంటూ ఎవరైనా ఉన్నారా ?"

"నదీమూలం, ఋషిమూలం తెల్సుకో కూడదంటారు. అమ్మ గతం ఏమిటో ఎవరికీ తెలియదు. తెల్సినదల్లా ఒక్కటే; అమ్మ తలుచుకుంటే చేయలేని దేమీ లేదని."

మెత్తని మందలింపు.

మరో గొంతు కల్పించుకుంది.

"నేను విన్నదాన్ని కూడా చెప్తున్నాను. అమ్మ ఎవరో, ఎక్కడి నుండి వచ్చిందో ఎవరికీ తెలియదు. పాతికేళ్ల క్రితం ఈ ప్రాంతం అనావృష్టిపీడితమై దుర్భర కాటకంలో మ్రగ్గిపోయిందట. వర్షం కురవని మేఘాలవైపు ప్రజలు ఆర్తిగా చూసే సమయంలో అమ్మ అవతరించిందట అమ్మవారి శిథిలాలయం ప్రక్కన. అమ్మ రాకతో మేఘాలు పురి విప్పినట్టు అమృతధారలు వర్షించేయట. అప్పట్నుండి ఇంతవరకూ ఈ ప్రాంతానికి కరువు, కాటకం లేకుండా పోయాయట...."

"అంత మాత్రాని ఆమెని దైవంగాకే అరాధించవలసిందేనా ? యాదృచ్ఛికంగా వర్షించనమేఘాలు ఆమెని ఉన్నతురాల్ని చేయగలిగేయా ? అమ్మ రాకతోనే అనావృష్టి దూరమవగలిగితే, ఈ దేశంలో ఇంకెన్ని ప్రాంతాలు ఏళ్లతరబడి వర్షానికి నోచుకోలేదు— అటువంటి ప్రాంతాల్లో కూడా వర్షం కురిపించ గలదా ఈ అమ్మ ??"

"అపచారం నాయనా— అపచారం ! అమ్మ సన్నిధానంలో కుతర్కాలకు, దుస్సంశయాలకూ తావులేదు. పెద్దపెద్ద డాక్టర్లకి కూడా అంతుబట్టని ఎందరో వ్యాధిగ్రస్థుల్ని కేవలం తన స్పర్శతోనే నయంచేయగల ఆదిశక్తి 'అమ్మ'."

అమ్మ రాకతో వాళ్ల సంభాషణ ఆగిపోయింది.

అందరూ భక్తిపూర్ణతతో చేతులు జోడించేరు.

ఒక్కొక్క వరసనీ దాటుకుంటూ అమ్మ ముందుకి నడుస్తోంది. ఒక చేతిలో త్రిశూలం, మరో చేతిలో అభయ ముద్రిక, నుదుట రూపాయి కాసంత కుంకుమ బొట్టు, విరబోసిన కురులు, దేహమంతటా చందనం పూత, ఎరుపు రంగు కంచిపట్టు చీరలో అమ్మ నిజంగా శాంభవిలా ఉంది.

అమ్మ నడుస్తుంటే గజ్జెల మ్రోత శ్రావ్యంగా వినిపిస్తోంది.

మృత్యుంజయరావ్ వద్ద క్షణం ఆగి పరీక్షగా చూసింది అమ్మ.

ముందుకి రెండడుగులు వేసినదల్లా మళ్లీ వెనక్కి తిరిగింది.

మరోసారి వాళ్లముందు నిలబడి చేతు లెత్తి దీవించి చరచరా ఆశ్రమంలోకి నడిచింది.

కొద్దిసేపటికి లోపల్నుండి కబురొచ్చింది.

మృత్యుంజయరావ్ కుటుంబాన్ని ఆశ్రమంలోకి తీసికురమ్మని అనుజ్ఞ అయింది.

ఇందుమతి కళ్లు మతాబాల్లా వెలిగిపోయాయి.

మృత్యుంజయరావ్ ఆ శిష్యుడి వెనుక ఆశ్రమ అంతర్భాగానికి నడుస్తుంటే అతని అదృష్టానికి ఒగిలినవాళ్లు కొద్దిగా అసూయపడ్డారు.

వసంతని జాగ్రత్తగా లోనికి నడిపిస్తోంది ఇందుమతి.

• • •

మృత్యుంజయరావ్ తలదించుక కూచున్నాడు.

వసంత 'అమ్మ' వైపు నిర్నిమేషంగా చూస్తోంది.

ఇందుమతి కన్నీటితో తమకొచ్చిన కష్టం ఏకరువు పెడ్తోంది.

"ఎన్ని మందులకీ లొంగలేదు. ఆఖరి ఆశగా మీ పాదాలవద్దకి తీసికొచ్చా నీ పిచ్చిపిల్లని. మీ అనుగ్రహంతో, ఆశీర్వాదబలంతో దీని బ్రతుకు మళ్లీ చిగురిస్తుందన్న నమ్మకం మమ్మల్ని మీ దర్శనానికి ప్రేరేపించింది."

అమ్మ వసంత వైపు తదేకంగా చూస్తోంది.

వసంత కళ్లు త్రిప్పుకోలేకపోతోంది.

రమ్మనట్టు సైగచేసింది అమ్మ.

మంత్రబద్ధలా వసంత ఆమె వద్దకి నడిచింది.

వసంత నుదుట కుంకుమబొట్టు అలంకరించింది అమ్మ.

ఇందుమతి తత్తరబడింది. వారించబోయింది.

అడ్డు రావద్దన్నట్టు సైగచేసింది అమ్మ.

"పసుపుకుంకుమలతో నూరేళ్లు వర్ధిల్లవమ్మా!"

వసంత పెదాలపై సన్నని చిర్నవ్వు.

మృత్యుంజయరావ్ తలెత్తి చూసేడు.

ఇందుమతి వైపు చూస్తూ చెప్పుకుపోతోంది అమ్మ.

"పరవళ్లు త్రొక్కే నదీ ప్రవాహం జీవితం. స్వేచ్ఛగా, విశృంఖలంగా పరిగిడడమే దాని ధ్యేయం. దాన్ని అడ్డుకుందామన్న మూర్ఖత్వం చంపుకోవాలి మనం."

ఇందుమతి శ్రద్ధగా ఆలకిస్తోంది.

"వైధవ్యం సమాజమేర్పరచిన కట్టుబాటు మాత్రమే! మారే తరాలతో బాటు కట్టుబాట్లు, సంప్రదాయాలు మారిపోతున్నాయి. అది సహజం. జీవితాన్ని శాసించే అధికారం గానీ, నిర్బంధించే హక్కుగానీ మనకు లేవు. ప్రాకృతిక

మైన శారీరక వాంఛల్ని చాదస్తాల ఇనుప రెక్కల క్రింద ఎందుకని నలుపుకోవాలి ?"

మృత్యుంజయరావ్ మనస్సు పొరలు పొరలుగా విడిపోతోంది.

గుండెల్ని చీల్చుకుంటూ లావా ఎగజిమ్ముతోంది.

"అమ్మాయికి తగిన వరుడు లభిస్తాడు కొద్దిపాటి అన్వేషణతో. ఏ సంఘర్షణకూ లోనుగాక అతని చేతిలో ఆమె జీవితాన్ని పదిలపర్చండి. అన్నీ సవ్యంగా జరుగుతాయి."

ఇందుమతి మొహం దీపంలా వెలిగిపోతోంది.

వసంత పెదాలపై చిర్నవ్వు ఆరలేదు.

మృత్యుంజయరావ్ చివాలున లేచి నిలబడ్డాడు.

అమ్మ లోపలి గదిలోనికి నడిచిపోయింది.

* * *

తన గదిలోకి చేరుతూనే 'అమ్మ' తలుపులు బిగించింది.

త్రిశూలం విసిరేసింది.

రుద్రాక్షమాలలు తీసి పారేసింది.

అలమరా తలుపు తెర్చి సీసా బయటకి తీసింది.

రెండు మాత్రలు గుటుక్కున మింగి గ్లాసెడు నీళ్ళు గటగటా త్రాగింది.

జుత్తు విరబోసుకున్న తన రూపం అద్దంలో వికృతంగా కన్పిస్తోంది. వెక్కిరిస్తున్నట్టున్న ఆ ప్రతిబింబాన్ని చూసి పిచ్చిదానిలా నవ్వుతోంది అమ్మ.

అంతకంతకూ ఆ నవ్వు పెరిగిపోతోంది.

తెరలు తెరలుగా నిండుకుంటోంది గది నిండా.

ప్రతిధ్వనుల నడుమ పూనకం వచ్చినదానిలా ఊగిపోతోంది అమ్మ.

"నీ ప్రేమని తిరస్కరించిన తర్వాత గానీ బ్రతుకంటే ఏమిటో తెలియలేదు. బ్రతుకు అర్థం తెల్సినాకా నీ కోసం నా అన్వేషణ ఫలరహిత మయిపోయింది. చేజేతులా దూరం చేసుకున్న అసౌభాగ్యం తిరిగి రాదని తెల్సినాక పిచ్చిదాన్నయ్యేను. ఎటుపోతున్నానో తెలియని స్థితిలో ఇక్కడికి చేరుకున్నాను. ఆ ఉద్విగ్నత, మతిచాంచల్యం నన్నో అమ్మగా మార్చివేసేయి.

అటు కట్టుబాట్లని త్రుంచుకోలేక, ఇటు ప్రాకృతిక వాంఛని అణగద్రొక్కలేకా ఘర్షణలో నలిగిన నా మనస్సు ఈ మార్గమే ఎన్నుకుంది.

పాతికేళ్ళ క్రితం నువ్వు చెప్పిన మాటలే ఈనాడు నీ కూతురికి నేను చెప్పవలసి రావడం ఎంత విషాద వాస్తవం!!

నే ననుభవిస్తున్న ఈ నరకం ఇంకెవ్వరికీ సంభవించకూడదు. ప్రకృతికి వైధవ్యం లేనట్టే స్త్రీకి కూడా వైధవ్యం లేదు, ఉండకూడదు.

వసంత జీవితం మళ్ళీ చిగురించాలి.

అంతే మృత్యుంజయా నేను కోరుకునేది—అంతే !!"

మంచం మీద అడ్డంగా వాలిపోయింది 'అమ్మ.'